క్లుప్తంగా

నేడు పలమనేరుకు ఎఫ్‌సీఐ ఈడీ రాక

పలమనేరు: మండలంలోని మొరం గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటనకు గురువారం ఉదయం 9 గంటలకు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సచీంద్రకుమార్ పట్నాయక్ రానున్నట్టు కార్యక్రమ లైజన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ తెలిపారు. వికసిత్ భారత్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు ఎలా అందుతున్నాయో ఆయన పరిశీలిస్తారని, లబ్ధిదారులతో మాట్లాడుతారని పేర్కొన్నారు. ఇందుకోసం స్థానిక సివిల్ సప్లయిస్ అధికారులు తగిన ఏర్పాట్లను చేపట్టారు.

28 నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

రొంపిచెర్ల: మండలంలో ఈనెల 29వ తేదీ నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరుగుతుందని ఎంపీడీవో రాజేంద్ర బుధవారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై మొబైల్ వాహనంలో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. 28న ఉదయం చెంచెంరెడ్డిగారిపల్లె, సాయంత్రం బండకిందపల్లె, 29న ఉదయం జాండ్లవారిపల్లె, సాయంత్రం బోడిపాటివారిపల్లె, 30న ఉదయం మోటుమల్లెల, సాయంత్రం బొమ్మయ్యగారిపల్లె, 31న ఉదయం గానుగచింత, సాయంత్రం పెద్దగొట్టిగల్లు, జనవరి 1న రొంపిచెర్ల, 2న ఉదయం చిచ్చిలివారిపల్లె, సాయంత్రం చల్లావారిపల్లె గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ఎస్‌ఐకు క్యాష్ రివార్డు



రివార్డు అందుకుంటున్న ఎస్‌ఐ మారుతి

సదుం: ఎస్‌ఐ మారుతి బుధవారం చిత్తూరులో ఎస్పీ రిశాంత్‌రెడ్డి చేతులు మీదుగా బుధవారం క్యాష్ రివార్డు అందుకున్నారు. మండల కేంద్రంలో అక్టోబరు 3న జరిగిన వరస చోరీల కేసు దర్యాప్తులో ప్రతిభ చూపడంతో క్యాష్ రివార్డు లభించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు చెప్పారు.

శివకుమార్‌కు రివార్డ్



ఎస్‌ఐ శివకుమార్

రామకుప్పం: ఇళ్లలో దొంగతనాలు, బ్యాంకు దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు మోస్ట్ వాంటెడ్ అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన రామకుప్పం ఎస్‌ఐ శివకుమార్, కానిస్టేబుల్ అన్బగలన్‌ను చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి అభినందించారు. చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో వారికి నగదు రివార్డును అందజేశారు.

దాతకు సన్మానం



దాత లక్ష్మీప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎంఈఓలు

సోమల: మండలంలోని వడ్డిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాత లక్ష్మీప్రసాద్‌ను ఎంఈఓలు శ్రీరాములు, శివరత్నమ్మ ఉపాధ్యాయులతో కలిసి బుధవారం సన్మానించారు. తన తల్లిదండ్రులు పగడాల రాజమ్మ ,కృష్ణమూర్తి జ్ఞాపకార్థం పాఠశాలలో మూడు తరగతి గదుల వరండాలకు రూ.2 లక్షల వ్యయంతో లక్ష్మీప్రసాద్ గ్రిల్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఈఓలు తెలిపారు. పీసీ కమిటీ చైర్మన్ మంజునాథ, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జీసీకే ప్రసాద్, ఉపాధ్యాయులు శివరాం, మహాలక్ష్మి, రిటైర్డ్ టీచర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

30న మున్సిపల్ బడ్జెట్ సమావేశం

పుంగనూరు: ఈనెల 30న ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు పన్నుల విధింపు లేకుండా ఆదాయం చేకూరేలా రూపొందించామని పేర్కొన్నారు.

మృతులకు నివాళి



ఓగులో మృతదేహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సోమశేఖర్ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆ గ్రామానికి చేరుకుని సోమశేఖర్ మృతదేహంపై పూలమాల వేసి, నివాళులర్పించారు. అలాగే మండలంలోని ఓగు పంచాయతీకి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు చిన్నప్ప గౌడ్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఆ గ్రామానికి చేరుకుని చిన్నప్ప మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, భరోసానిచ్చారు. నాయకులు నరేంద్ర, సురేష్, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

హోరాహోరీగా ఆడుదాం-ఆంధ్రా



పుంగనూరు: చంద్రమాకులపల్లెలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పలమనేరు: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా క్రికెట్‌లో మండలంలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీ విజేతగా ఎం కోటూరు జట్టు నిలిచింది. ఐదు జట్లు పాల్గొనగా, పంచాయతీ స్థాయిలో గెలిచిన ఎంకోటూరు మండల స్థాయి పోటీలకు ఎంపికైంది. గెలుపొందిన క్రీడా కారులకు ప్రోత్సాహంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రూ.20 వేలను అందజేశారు. సచివాలయ సిబ్బంది, పీఈటీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత ఆర్సీపురం జట్టు

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలో జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీలలో ఫజులుపేట జట్టుపై ఆర్‌సీపురం కాలనీ జట్టు గెలుపొందింది. విజేత జట్టును ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అభినందించారు. రొంపిచెర్ల పంచాయతీలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్ ఆధ్వర్యంలో పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు కోటా వెంకటరమణ, సదాశివ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

అదరగొడుతున్న ఆటగాళ్లు

పుంగనూరు: మున్సిపాలిటీలో కమిషనర్ నరసింహ ప్రసాద్, చైర్మన్ అలీమ్‌బాషా కలసి బుధవారం రెండవ రోజు ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. చైర్మన్, కమిషనర్ సరదాగా బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అలాగే మండలంలోని చంద్రమాకులపల్లెలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో నారాయణ వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు జయరాం, నాయకులు నవీన్‌కుమార్‌రాజు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోటీలు

సదుం: మండలంలో 11 సచివాలయాల పరిధిలో బుధవారం రెండో రోజు ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు జరిగాయి. క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొన్నట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు.

యువతను ప్రోత్సహించేందుకే..

పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప తెలిపారు. రాయలపేట, కమ్మపాళ్యం సచివాలయ పరిధిలో బుధవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తితో కలసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి రవికుమార్, తహసీల్దార్ లోకేశ్వర రావు, ఎంఈఓ తులసీరామ్, ఈఓపీఆర్‌ఆర్డీ శారదా దేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ఆహ్వానితులు చంద్రశేఖర్ రెడ్డి,



రొంపిచెర్ల: ఆర్‌సీపురం జట్టును అభినందిస్తున్న ఎంపీపీ



సోమల: కందూరులో క్రికెట్ ఆడుతున్న ఆర్డీఓ

వైస్ ఎంపీపీ అంజమ్మ, సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి పాల్గొన్నారు.

రెండవ రోజు 17 మ్యాచ్‌లు

గంగవరం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు రెండవ రోజు బుధవారం మండలంలోని 9 సచివాలయాల పరిధిలో జరిగాయి. దండపల్లి, గంగవరం-1, 2, గుండుగల్లు, కలగటూరు, కల్లుపల్లి, కీలపట్ల, పత్తికొండ సచివాలయ పరిధిలోని క్రీడా మైదానంలో క్రికెట్, తాళ్లపల్లెలో వాలీబాల్ పోటీలు జరిగాయి. తొమ్మిది సచివాలయాల పరిధిలో రెండవ రోజు జరిగిన ఆడుదాం ఆంధ్ర టోర్నీతో మొత్తం 17 మ్యాచ్‌లు పూర్తయినట్టు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

వాలీబాల్ పోటీలు

బైరెడ్డిపల్లె: 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని సచివాలయాల్లో వాలీబాల్ పోటీలు హోరా హోరీగా జరిగాయి. క్రీడల్లో పాల్గొనేందుకు యువత ఆసక్తి చూపడంతో పోటీలు రసవత్తరంగా మారాయి.

రెండో రోజు రసవత్తరంగా

చౌడేపల్లె: మండలంలోని 15 సచివాలయాల పరిధిలో బుధవారం రెండో రోజు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరా హోరీగా సాగాయి. పెద్దకొండామర్రిలో క్రీడాకారులను సర్పంచ్ జయసుధమ్మ పరిచయం చేసుకున్నారు.

సోమల మండలంలో..

సోమల: మండలంలోని కందూరులో ఆడుదాం ఆంధ్ర పోటీలను బుధవారం పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. సర్పంచ్ బాషా మసూద్, తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ, పంచాయతీ కార్యదర్శులు జైశంకర్, లోకేష్, సునీత, పీడీ చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.



సదుం :చెరుకువారిపల్లెలో బ్యాడ్మింటన్ పోటీలు



పలమనేరు: విజేత నిలిచిన ఎం.కోటూరు జట్టు



పెద్దపంజాణి : పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ



గంగవరం: తాళ్లపల్లెలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



పుంగనూరు : సరదాగా బ్యాటింగ్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా



బైరెడ్డిపల్లె : వాలీబాల్ ఆడుతున్న యువత



పెద్దకొండామర్రిలో క్రీడాకారుల పరిచయం



ఆమినిగుంటలో క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

చెకుముకి పోటీల్లో విజేతలు వీరే

రామకుప్పం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో సింగసముద్రం, పంద్యాలమడుగు, ముద్దనపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన సింగసముద్రం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జనవరి 7 వ తేదీన జరిగే జిల్లా స్థాయి చెకుముకి పరీక్షకు అర్హత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం సుజాత అభినందించారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

నేడు పలమనేరు మున్సిపల్ మీట్

పలమనేరు: పలమనేరు మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ కిరణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు, కోఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

దారి సమస్యను పరిష్కరించండి



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆయకట్టు రైతులు

బైరెడ్డిపల్లె : మండలంలోని కడపనత్తం పెద్దచెరువు ఆయకట్టులోని పొలాల దారి సమస్యను పరిష్కరించాలని బుధవారం తహశీల్దార్ కుమారస్వామికి రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు మాట్లాడుతూ తాము పొలాల వద్దకు వెళ్లేందుకు గతంలో దారి సౌకర్యం ఉండేదన్నారు. పాతపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దారిని పూడ్చివేసి ఆక్రమించుకోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. సమస్యను పరిష్కరించి తమ ఇబ్బందులు తొలగించాలని కోరారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సరదాగా క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ

రామకుప్పం: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో కుప్పం నుంచి పోటీ చేయనున్న భరత్ గెలుపునకు మద్దతు పలకాలని ఆయన సతీమణి దుర్గ కోరారు. మండలంలోని చెల్దిగానిపల్లె పరిధిలో బుధవారం ఆమె ఇంటింటికి వెళ్లి పసుపు, కుంకుమ, చీర పంపిణీ చేశారు. పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ఆమె సరదాగా కాసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. సర్పంచ్ రాజా, నేతలు రాజారెడ్డి, పార్టీ ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సుబ్రమణ్యం, కుమార్, హరిభూషణ్, శంకరప్ప పాల్గొన్నారు.

చుక్కలు చూపిస్తున్న కేఎస్ ఆర్టీసీ

పలమనేరు పట్టణానికి వచ్చే ప్రయాణికులపై కర్ణాటక ఆర్టీసీ కండక్టర్ల నిర్లక్ష్యం చూపుతున్నారు. తిరుపతి- బెంగళూరు బస్సుల్లో పలమనేరు ప్రయాణికులను ఎక్కించుకోవడం లేదు. అటు బెంగళూరు- తిరుపతి బస్సుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. డైరెక్ట్ టిక్కెట్లు ఖాళీగా ఉంటే మాత్రం పలమనేరు ప్యాసింజెర్లను ఎక్కించుకోవడం, డైరెక్ట్ టిక్కెట్లు ఉంటే బైపాస్‌లో వెళుతున్నారు. పలమనేరు డిపో నుంచి ఒక్క బస్సు కూడా బెంగళూరు- తిరుపతికి లేక పోవడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

- తిరుపతి నుంచి పలమనేరుకు ఎక్కించుకోని వైనం
- బెంగళూరునుంచి ఇక్కడికి రావాలన్నా ఇదే పరిస్థితి
- డైరెక్ట్ టిక్కెట్లు లేకుంటే మాత్రం పలమనేరులోకి ఎంట్రీ

పలమనేరు : తిరుపతి నుంచి నిత్యం పలమనేరుకు, బెంగళూరు నుంచి పలమనేరుకు వేల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. నిత్యం బెంగళూరులో పనులు చేసి వచ్చేవారు, వారాంతపు సెలవుల్లో ఇక్కడికి వచ్చేవారు ఉన్నారు. ఈ మార్గంలో పలు ఏపీ హైటెక్ బస్సులు పలమనేరు పట్టణంలోకి రాకుండా బైపాస్‌లో వెళుతున్నాయి. పట్టణంలోకి వచ్చే సర్వీసులు చాలా తక్కువ. కర్ణాటక ఆర్టీసీకి చెందిన వంద బస్సులు ఈ మార్గంలో నిత్యం నడుస్తున్నాయి. ఇందులో పర్మిట్ కూడా లేని బస్సులు సగానికిపైగానే ఉన్నట్టు ఆర్టీవో అధికారులకు సైతం తెలిసిన విషయమే. వీటిపై స్థానిక అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అంతుచిక్కడం లేదు. తిరుపతి బస్టాండులో కర్ణాటక బెంగళూరులో బస్సులో కండక్టర్లు సీట్లు ఖాళీ ఉన్నా పలమనేరు ప్రయాణికులను ఎక్కించుకోవడం లేదు. నాన్ స్టాప్ బెంగళూరంటూ డైరెక్ట్ టిక్కెట్లను మాత్రం ఎక్కించుకుంటున్నారు. దీంతో పలమనేరుకు వెళ్లాలంటే చాలా కష్టంగా మారుతోంది. అదే బెంగళూరు ప్రయాణికులు తక్కువగా ఉంటే మాత్రం ఎక్కించుకుంటున్నారు. ఇదే పరిస్థితి బెంగళూరు నుంచి పలమనేరుకు రావాలన్నా నెలకొంది. స్థానిక ఆర్టీసీ అధికారులు సైతం ఈ సమస్యను ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ సమస్యపై పట్టణవాసులు పలు మార్లు స్థానిక డీఎంలకు వినతిపత్రాలనందించారు. కనీసం పలమనేరు నుంచైనా బెంగళూరుకు బస్సులు నడపాలని కోరినా ప్రయోజనం లేకుండా పోతోంది.



ఎన్ని అగచాట్లో



రెండు రోజుల కిందట తిరుపతి నుంచి పలమనేరుకు బయలదేరా. ఏపీ కంటే కేఎస్ ఆర్టీసీ బస్సులు ఎక్కువగా కనిపించాయి. పది బస్సుల వద్దకు వెళ్లి కండక్టర్లను అడిగా పలమనేరని. అయితే వాళ్లు ఎక్కించుకోలేదు. దీంతో చిత్తూరు కొచ్చి అక్కడినుంచి అర్ధరాత్రికి ఇంటికొచ్చా. ప్రయాణికుల అవస్థలను ఆర్టీసీ అధికారులు గుర్తించాలి.
– నవీన్‌కుమార్, పలమనేరు

ఏళ్లుగా ఇదే సమస్య



పలమనేరుకు రావాలంటే బెంగళూరు నుంచి ఎక్కించుకోరు, తిరుపతి నుంచి రావాలన్నా ఎక్కనివ్వరు. పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. పోనీ ఇక్కడి డిపోనుంచైనా బెంగళూరు- తిరుపతి సర్వీసులను నడపమన్నా నడపరు. పలమనేరు పరిరక్షణ సమితి ఆందోళన చేయనుంది. – నరసింహులు, కార్యదర్శి, పలమనేరు పరిరక్షణ సమితి

అన్నా నీకు టికెట్ వస్తుందో.. రాదో చూసుకో..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- చిన్నేపల్లెకు రోడ్డు ఎవరు వేయించారో ప్రజలకు తెలుసు
- పనికిమాలిన మాటలు మాట్లాడితే ఖబడ్దార్
- మాజీ మంత్రి అమర్‌పై ఎమ్మెల్యే వెంకటేగౌడ ధ్వజం

వి.కోట: 'అన్నా అమర్ ..మీకు ఈసారి మీ పార్టీ టికెట్ ఇస్తుందో లేదో చూసుకోండి.. మళ్లీ నా గురించి మాట్లాడండి' అని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి మంగళవారం మండలంలోని ఇటుకరాళ్లపల్లె గ్రామంలో, 3 రోజుల కిందట జవ్వనపల్లె గ్రామంలో తనను విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలపై వెంకటేగౌడ తీవ్రంగా స్పందించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దపంజాణి మండలం చిన్నెపల్లెకు మీరు రోడ్డు సాంక్షన్ చేశారా అని ప్రశ్నించారు. తాను నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలు తిరిగినప్పుడు చిన్నేపల్లె వాసుల విజ్ఞప్తి మేరకు 2023, ఆగస్టు 29న శాంక్షన్ చేయించానని, ఆ విషయం చెప్పకుండా ఏదోదో మాట్లాడడం తగదని తెలిపారు. 'ఈ నాలుగున్నరేళ్ల బయటకు రాని నువ్వు ఇప్పుడొచ్చి పనికిమాలిన మాటలు మాట్లాడితే ఖబడ్దార్.. నీకు 2024లో మీ పార్టీ టికెట్ ఇవ్వదు.. ఇచ్చినా ఓటమి పాలకావడం తథ్యం.. నా టికెట్ గురించి నీకెందుకు.. వీ.కోటలో తిరుగుతూ మీసాలు తిప్పితే జనం నమ్మే పరిస్థితి లేదు' అని హితవు పలికారు. రోజూ ప్రెస్‌మీట్‌లు పెట్టి అవాస్తవ ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మేస్తారనుకోవడం మీ భ్రమ అని పేర్కొన్నారు. మీరు చర్చకు వస్తే వైఎస్సార్‌సీపీ చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధుల లెక్కలు చూపిస్తాం.. ప్రజలకు ఏది నిజమో.. ఏది అబద్ధమో తెలుస్తుందని సవాలు విసిరారు. అప్పుడు చిన్నేపల్లె రోడ్డు విషయం ఇంకా బాగా అర్థమైపోతుందని, రాజకీయ ఊసరవెల్లిలా ఏ వానకు ఆ గొడుగు పట్టే మీ మాటలను ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ యువరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్, నాయకులు గోపిరెడ్డి, సయ్యద్ షామీర్, కుమార్ రాజా, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సవాల్ స్వీకరించకుండా కాకమ్మ కథలెందుకో?

పలమనేరు: నియోజకవర్గంలో రోడ్లకు సంబంధించి ఏ వేదికైనా సిద్ధమేనని తాను ప్రకటించినా, ఆ సవాల్‌ను స్వీకరించకుండా కాకమ్మ కథలు చెప్పడం ఏమిటని మాజీ మంత్రి అమర్‌పై ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కొలమాసనపల్లెలో బుధవారం ఆయన మాట్లాడుతూ వీకోట మండలంలోని జవునిపల్లె రోడ్డును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేసిందని తాను అంటున్నానని, కాదు టీడీపీ అని మీరు అంటున్నారని, మీ ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి ఖర్చు చేసినట్లు నిరూపించినా తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. దీన్ని నిరూపించకుండా ఇతర విషయాలను మాట్లాడుతూ ఆది నుంచి జనాన్ని ఎలా ఏమార్చారో, అదే పద్ధతిలో మాట్లాడితే ఏమనాలో అర్థం కావడం లేదని ఆరోపించారు. తన సవాల్‌ని స్వీకరించకుండా మీసాలు తిప్పుతూ మాట్లాడడం కరెక్ట్ కాదన్నారు. మీసొంత మండలంలోని చిన్నేపల్లెలో అక్కడి ప్రజల వినతి మేరకు రోడ్డు వేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని తెలుసుకోవాలని తెలిపారు. నాలుగేళ్లుగా ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, ఎన్నికల సమీపిస్తుండడంతో మీరు చేస్తున్న డ్రామాలను జనం బాగా గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోవడం గ్యారెంటీ అని తెలుసుకుని ఫ్రస్టేషన్‌లో ఏవేవో మాట్లాడుతున్నారని జనానికి కూడా అర్థమైందని విమర్శించారు.

సిబ్బంది సెలవుపెడితే రిజిస్టర్‌లో నమోదు చేయరా?

- పలమనేరు ఎంపీడీవో తీరుపై జెడ్పీచైర్మన్ ఆగ్రహం

పలమనేరు: సెలవుల రిజిస్టర్‌లో సిబ్బంది సీఎల్ కూడా నమోదు చేయక పోయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని ఎంపీడీవో విద్యాసాగర్‌పై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో చాలామంది సిబ్బంది విధులకు హాజరుకాలేదు. అటెండెన్స్ రిజిస్టర్‌లో కూడా సెలవు నమోదు కాలేదు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మండలస్థాయి పరిపాలనలో కీలకమైన ఎంపీడీవో ఇంత నిర్లక్ష్యంగా ఉంటే పాలన ఎలా ఉంటుందో బాగా అర్థమవుతోందని అసహనం వ్యక్తం చేశారు. ఇంకోసారి ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా అందుకు ఎంపీడీవోనే బాధ్యత వహించాల్సి ఉంటుందని, చర్యలు తప్పవని హెచ్చరించారు. జెడ్పీ చైర్మెన్ ప్రశ్నలకు ఎంపీడీవో సరైన సమాధానాలివ్వకుండా నీళ్లు నమలడం గమనార్హం.



పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు

నేటి విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద గురువారం ఉదయం నిర్వహించే విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఈ శ్రీనివాసమూర్తి కోరారు. బుధవారం ఏడీ కార్యాలయంలో ఆయన విద్యుత్ అదాలత్ కరపత్రాలను డివిజన్‌లోని ఏఈలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమ ఏర్పాట్లపై ఏడీ చిన్నబ్బతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ చైర్మెన్‌గా శ్రీనివాస ఆంజినేయ మూర్తి, ఆర్థిక సభ్యుడు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీ కుమార్, వినియోగదారుల సంఘం సభ్యురాలు ఈశ్వరమ్మ హాజరై వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. అధిక కరెంట్ బిల్లులు, పాత కేసులు, సాంకేతిక సమస్యలను లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. డివిజన్‌లోని పలువురు ఏఈలు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈ శ్రీనివాసమూర్తి

7న శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ



పుంగనూరులో సుందరంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల కూడలి, కాంస్య విగ్రహం

పుంగనూరు: పట్టణ సమీపంలోని భీమగానిపల్లె సర్కిల్‌లో నూతనంగా అత్యంత సుందరంగా రాయల వైభవాన్ని గుర్తు చేసేలా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని జనవరి 7 న ఆవిష్కరించనున్నారు. పట్టణంలోని కృష్ణదేవరాయ బలిజసేవా సంఘం ఆధ్వర్యంలో ఈ విగ్రహ ఏర్పాటుకు సుమారు రూ.50 లక్షలు విలువ చేసే స్థలాన్ని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కేటాయించి, ఆప్రాంతాన్ని కృష్ణదేవరాయ సర్కిల్‌గా నామకరణం చేశారు. విగ్రహాన్ని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి ఏర్పాటు చేశారు. సుమారు రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన సర్కిల్‌ను, విగ్రహాన్ని మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని బలిజ సంఘ నాయకులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని సంఘ నాయకులు కోరారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

తవణంపల్లె: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టేందుకు కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ గంగా భవాని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనుల సామాజిక తనిఖీపై బహిరంగ సభ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మండలంలో 1,496 పనులకు రూ.4,16,15,084 ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు చెందిన 26 పనులకు రూ.1,94,86,444, ఒక ఆర్‌డబ్ల్యూఎస్ పనికి రూ.1.08,417 వ్యయం చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 2022 ఆర్థిక సంవత్సరం నుంచి మార్చి 2023 వరకు జరిగిన పనులను తనిఖీ చేసినట్లు వివరించారు. తనిఖీల్లో కారకాంపల్లె, ఎ.గొల్లపల్లె, సరకల్లు పంచాయితీల్లో హౌసింగ్ బిల్లుల అవకతవకలు జరగడంతో రూ.14,831 రికవరీకి ఆదేశించారు. తొడతర, సరకల్లు, కారకాంపల్లె ఫీల్డు అసిస్టెంట్లు రికార్డులు సక్రమంగా సకాలంలో సమర్పించలేదని ముగ్గురికి రూ.1700 అపరాధం విధించారు.